# చెదరిన గాలి

కొండమీద గుంపుగా ఉన్న చెట్లకింద, నల్లరాతిమీద ఒదిగి కూర్చుంది సుమన. కొంచెం దూరంగా మేకపిల్లలు మెడలు నిక్కబొడుచుకుని, ముందుకు వంగి కొమ్మలలో ఆకులు నములుతున్నాయి. నిడుపైన కట్టె దగ్గరగా పెట్టుకుంది సుమన. అప్పుడప్పుడు ఆ కట్టె తీసుకుని నేలమీద తట్టి మేకల్ని అదలిస్తోంది. ఏమీ తోచక నలుదిక్కులూ చూచి, ఆకాశంలో ముసురుకుంటోన్న మబ్బులు చూచి విసుగ్గా ఆవలిస్తోంది. నల్ల రాతిమీద వెల్లకితలా పడుకొని గడ్డిపరకలు కొరుకుతూ కలలు కంటోంది. కల చెదరిపోగానే ప్రక్కకు ఒత్తిగిలి చెక్కిళ్ళలో చేతులు చేర్చుకుని ఊహల్లో మునిగిపోతోంది.

క్రమంగా పొద్దువాలింది. ఎండకాంతి తగ్గింది. ఇంకాస్సేపటికి మేకపిల్లలను జత కూర్చుకుని మెల్లగా మెట్లు దిగిపోవాలి. ఇప్పుడే ప్రారంభిస్తే మెల్లమెల్లగా కొండ దిగిపొయ్యేటప్పటికి మసక మసకగా చీకటి తెర జారుతూ ఉంటుంది. వీధి గుమ్మం దగ్గర అమ్మ బియ్యం చెరుక్కుంటూ ఆశగా ఎదురు చూస్తూ ఉంటుంది. నడవలో మంచంమీద ఆ వేదనతో, పమిట కొంగుతో గాలి విసురుకుంటూ అమ్మమ్మ ఆదుర్దాగా ఎదురు చూస్తూ ఉంటుంది.

అది తలుచుకుంటేనే సుమనకు నిస్పృహ కలుగుతుంది. తన కా వాతావరణమే నచ్చదు. స్వేచ్ఛగా గాలి పీల్చటానికి వీల్లేకుండా ఏదో బందిఖానాలో ఉన్నట్లు ఉంటుంది. అడుగడు

గునా, నిమిషనిమిషమూ అమ్మకళ్ళు తన్ను కనిపెడుతూ కాపాడుతూనే ఉంటాయి. తనకు ఊపిరాడదు! శక్తిలేని రోదన ధ్వనితో విరామ మెరుగని అమ్మమ్మ మూలుగు, గుండెల్లో ఏదో సూదిమొన గుచ్చుకున్నట్లుంటుంది! ఆ బాధ భరించ లేదు. దూరంగా పారిపోనూ లేదు. ఏదో అలసిపోయి దిక్కు తోచనట్లుంటుంది.

ఈ మేకపిల్లలతో, ఈ కొండమీద ఉన్న కాస్సేపూ హాయిగా ఉంటుంది. అన్నింటికీ దూరంగా ఇక్కడ తాను మేక పిల్లలతో పాటు చెంగు చెంగున ఎగిరి స్వేచ్ఛగా ఆడుకొంటుంది. అలసిపోయి నిద్రపోతుంది. కన్నులు తెరిస్తే మెరసిపొయ్యే రంగురంగుల పువ్వులు మురిపించి మురిపించి మైమరపిస్తాయి. కనుచూపు మేరలో ఎటు చూసినా, మనిషి అలికిడి ఉండదు: మనసుకు బాధా ఉండదు. ఎంతసేపైనా కదలి కదలి కుప్ప లుగా రాలే పూవులూ, ఎగిరి ఎగిరి దూరంగా సాగిపొయ్యే ఆకులూ, చెదరి చెదరి అంతటా నిండి చల్లగా కౌగలించే గాలి, కదలిక లేకుండా మౌనంగా పలకరించే శిలలూ! అంతే! ప్రొద్దు వాలకుండానే ఉంటే! కొండ దిగకుండానే ఉంటే!

ఈ కొండ మొదట్లో లోయలోనే తన ఊరు. ఊరని పేరేగాని పాతిక ఇండ్లైనా లేవేమో! అవీ దగ్గరగా లేవు. చెదరి చెదరి ఎగుడు దిగుడుగా, దూరదూరంగా ఉన్నాయి. ఒక ఇల్లు ఒకడుగు పైనా, మరొకటి మళ్లా రెండడుగులు దిగు వన! దూరంగా పెద్దతోట. ఆ తోట వాకిట్లోనే ఒకపక్క

పెద్ద ఇల్లు. మరొక పక్క పెద్ద బావి ఆ ఇల్లే తన ఇల్లు. ఆ బావే ఆ ఊరికంతా బావి.

చీకటితో నాలుగు గంటల నించి పొద్దుకూకే వరకూ ఎవరో ఒకరు ఆ బావి దగ్గర ఉండనే ఉంటారు. వరండాలో నిద్రపొయ్యే తనకు ఆ బావి గిలక చప్పుడుతోనే ఉదయం మెళు కువ వస్తుంది. ఆ సొద వింటూ పడుకుంటుంది. ముందుగా కిఱ కిఱమని గిలక చప్పుడూ, కాస్సేపటికి గలగలమని మాటలూ! ఇంకాస్సేపటికి అఱుపులు, పోట్లాటలు, కేకలూ! తక్కిన ప్రపంచ మంతా తాత్కాలికంగా స్తంభించిపోతుంది. అప్పటికి బద్ధ కంగా ఆవలిస్తూ తను లేస్తుంది. ఏదో ఇంకో లోకంలో జరుగు తున్న తమాషాలా ఆ హడావిడి చూస్తూ, వింటూ కూర్చుం టుంది.

ఆ బావి చాలా పెద్దది. ఎన్ని నీళ్ళు తోడినా వేసవిలో కూడా వట్టిపోదు. అయినా రోజూ నీళ్ళకోసం పోట్లాటలు తప్పవు. ఎవరికి కావలసిన నీళ్లు వాళ్ళే ముందు తోడుకోవాలి. అక్కర లేకపోయినా తోడుకుని అందరకన్నా ముందుగానే దాచుకోవాలి. ఒక్కొక్కరి దృష్టిలోనూ తక్కినవాళ్ళందరూ స్వార్థపరులూ, కలహప్రియులూ! పోట్లాడనిదే మానవుడు ముందుకు సాగలేడు! బ్రతకనూ లేడు!

తన ఇంట్లో తనూ, అమ్మ, అమ్మమ్మా తప్ప ఇంకెవరూ లేరు. తనకు బుద్ధి తెలిసినప్పటినుంచీ అమ్మమ్మ మంచంలోనే ఉంటోంది. అసలు నిజానికి ఆవిడ అమ్మకే అమ్మమ్మ అవు

తుంది. అలవాటుకొద్దీ తనూ అలానే పిలుస్తుంది. ఆవిడ అమ్మకి అత్తగారూ అవుతుంది. నాన్న అమ్మకి మేనమా మేనట. అమ్మకి నోటిదురుసుతనం ఎక్కువ. ఏదైనా కఠినంగా గబగబా మాట్లాడుతుంది. ఈవిడకి అందరికిమల్లె జాలీ, దయా ఉండవా అనిపిస్తుంది ఒక్కొక్కసారి తనకి. గాలికి కదలి ఓ పూవు రాలి పోయినా తనకి ఏదో గుండెల్లో బరువుగా ఉంటుంది. మనసు క్రుంగిపోతుంది. మిన్ను విరిగి మీదపడినా అమ్మ తొణకకుండా నిర్లక్ష్యంగా ఉంటుంది, "ఆ, అంతకన్నా ఏమవుతుందీ?" అంటుంది వెక్కిరింపుగా నవ్వుతూ. ప్రతిదానికీ వణికిపొయ్యే తనను చూస్తే అమ్మకి చిరాకు. "ఇంత సున్నితంగా ఉంటే ఈ ప్రపంచంలో ఎల్లా బ్రతగ్గలవు తల్లీ" అంటుంది. మొరటుగా ఉంటేనేతప్ప జీవితం గడవదు కాబోలు! ఏమో తనకు తెలీదు. తా నెల్లా బ్రతుకుతుందో! అమ్మలా మొరటుదేలేముందు తన గుండె ముక్కలుముక్క లవుతుంది. ఏమీ మిగలదు. అది మాత్రం నిజం !

తన చిన్నప్పుడే నాన్న ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఎక్కడికో ఎవరికీ తెలియదు. తనకు నాన్న మొహం కూడా తెలియదు. నాన్నది చాలా జాలిగుండెట. ఎవరు కష్టంలో ఉన్నా చూడలేడట. ఆకులో పెట్టిన అన్నం కూడా సమయానికి ఎవరైనా వస్తే పెట్టి పంపించేవాడట. అందరి సంసారాలూ, అందరి కష్టాలూ తన నెత్తిన వేసుకుని ఆస్తి అంతా పోగొట్టుకున్నాడట. చివరకు ఈ కొండదగ్గర తోటా యిల్లు

మాత్రమే మిగిలాయిట. చేతిలో డబ్బులేక ఇబ్బందిపడుతూ భరించలేక దిక్కుతోచక ఒకరోజు వెళ్ళిపోయాడుట. మళ్ళా రాలేదు.

వెళ్ళేరోజురాత్రి అమ్మ వెన్నెట్లో రేకుడబ్బాలో చిల్లర డబ్బులు లెక్కకుదరక మళ్ళా మళ్ళా లెక్కపెట్టుకుంటోందిట. ఆసుబయట వెల్లకిలా కండువా మడిచి దిండులా పెట్టుకుని నాన్న పడుకున్నాట్ట. చాలాసేపు నాన్న అక్కడ ఉన్నదే అమ్మ గమనించలేదు. ఎప్పటికో నాన్న అన్నాడుట, "ఈ వెన్నెల కరగినబంగారంలా పైనించి జారుతున్నట్లుందికదూ?" అని. అమ్మ తెల్లబోయింది. ఆవిడ నాన్ననీ, వెన్నెలనీ అంతవరకూ చూడలేదు. మళ్ళా లెక్కచూసుకుంటూ అన్నదిట. "పొద్దున ఈ డబ్బాలో మూడురూపాయల ఒక అణా కదా పెట్టాం! అణా తక్కువవస్తున్నదే! లెక్క కుదరటంలేదు" అని. నాన్న మాట్లాడకుండా లేచి కూర్చుని నిట్టూరుస్తూ అన్నాడట. "పరవాలేదు, నాకు నమ్మకం ఉంది. నా కన్నా నువ్వే చక్కగా సంసారం దిద్దుకురాగలవు" అని. ఆ మాటతో అల్లాగే కండువా దులిపి పైన వేసుకుని బయటికి వెళ్ళిపోయాడుట. అమ్మ తెల్లబోయి చూస్తూ ఊరుకుంది. ఆ మాటలు ఆమెకు అర్థంకాలేదు. అంతే! ఆ వెళ్ళటం నాన్న తిరిగి మళ్లా రానేలేదు. ఆ మాటలుఅమ్మకి ఇప్పుడిప్పుడే అర్థమౌతున్నాయి.

అయినా, అమ్మ అధైర్యపడలేదు. ఈ మిగిలిన ఒక్క తోటలో కూరలూ, పళ్ళూ పండించి సంసారం దాటేస్తూనే

ఉన్నది. ఇప్పటికీ రాత్రిళ్ళు రేకుడబ్బా తెరచి చిల్లర లెక్క పెడుతూ నేఉంది. మౌనంగా, మొండిగా రోజులు గడుపుతోంది. కళ్ళల్లో నిరాశా, మాటల్లో కరుకుదనంమాత్రం నింపుకుంది!

పదిహేనేండ్లయింది. నాన్న తిరిగి/వస్తాడని ఆ ఇంట్లో ఎవరూ అనుకోవటంలేదు, ఒక్క అమ్మమ్మ తప్ప. ఆవిడ మాత్రం ఎప్పుడో ఒక్కసారి తప్పక వస్తాడని, తన గుండెల్లో దీపం ఆరిపోయ్యేలోపల ఎప్పుడో ఒక్కసారి తప్పక కనిపిస్తాడని ఆశపడుతూ ఉంటుంది. అల్లాగే ఎదురుచూస్తూ ఉంటుంది!

ఎప్పుడో అమ్మమ్మకి అకస్మాత్తుగా నడుములు పట్టుకున్నాయి. అప్పటినించీ కదలలేదు. భౌతికంగా జీవితంలో సుఖాలన్నీ దూరమైనాయి. మానసికంగా వ్యథమాత్రం మిగిలింది. మంచంలో కూర్చుని గతజీవితపు దృశ్యాలను నెమరు వేసుకుంటూ ఉంటుంది. ఎవరూ వినక్కరలేదు. తనలో తానే మాట్లాడుకుంటూ ఉంటుంది. కదలని దేహంలో కదలిపొయ్యే మనస్సుతో ఏవేవో ఎడతెగని కోరికలు కోరుకుంటుంది. అమ్మ ఒక్కటీ సాగనివ్వదు. "ఆ! నీ కొడుకు ఆస్తి అంతా వృద్ధిచేసి పోయాడుగా!" అంటుంది ఈసడింపుగా!

తనకు ముల్లు గుచ్చుకుంటుంది! అమ్మ కెందుకంత కాఠిన్యం? ఆవిడ తల్లికి తల్లేగదా! అత్తాకోడళ్ళనగానే ద్వేషాలు మొలకెత్తుతాయేమో! తను అమ్మమ్మదగ్గర కూర్చుంటుంది. వడిలిపోయిన వేళ్ళతో అమ్మమ్మ తన తల నిమురుతుంది. ఎండిపోయి శక్తిలేని చేతులతో కౌగలించు

కుంటుంది. అప్పుడామె ముఖంలోని తృప్తీ, ఆనందమే తనకూ ఆనందము.

"ఈ మొద్దు దుప్పటి ఒకటే బరువు! ఏదైనా మెత్తనిది తెప్పించుకుంటే బాగుండును."

"ఎక్కడో నేతిగారెల వాసన వేస్తోంది. మనింట్లోనేనా! నాకు రెండు పెట్టకూడదూ! ఎన్నాళ్ళనుంచో తినాలనిపిస్తున్నది."

"ఈ నడవాలో గాలి లేదు. దోమలు కుడుతున్నాయి! నా మంచం ముందర గదిలో వేయకూడదూ?" ఇవి అమ్మమ్మ కోరే కోర్కెలలో కొన్ని.

"ఆ పట్నం వెళ్లి మెత్తని దుప్పట్లు కొని తెస్తాం. డబ్బు సంచులు మూలుగుతున్నాయి గదూ!"

"ఇంట్లో నెయ్యే నిండుకున్నది. ఇంక నేతిగారెలు కూడా ఎక్కడనించి వస్తాయి?"

"అదీ! నీ మంచం కాస్తా ఆ ముందరగదిలో వేసి కూర్చుంటే సరి! ఎవరైనా వస్తే వచ్చినదోవనే పోతారు."

ఇవీ అమ్మ మొరటుగా చెప్పే సమాధానాలు. రోజంతా ప్రతిరోజూ ఇల్లా సాగుతూనే ఉంటుంది. అడకత్తెరలో పక్కలా నలిగిపోవడంతప్ప ఈ సంఘర్షణలో దైన్యముతో తాను ఏమీ చెయ్యలేదు. తనకు విసుగూ, విరక్తీ. ఎంత చెప్పినా అమ్మ తన మాటా వినదు.

భరించలేనప్పుడు తను అమ్మమ్మని కావలించుకుని ఆమె మాటలు వింటూ నిద్రపోతుంది. అమ్మమ్మ తనను ఓదారుస్తూ

తృప్తి పడుతుంది.

"మాణిక్యంలాంటివాడు వెళ్ళాడు. మనకీ కష్టాలు చుట్టుకొన్నాయి. మళ్ళా వస్తాడులే! నా మీద ప్రాణం వాడికి. చూడకుండా ఉండలేడులే! వస్తాడులే! ఎప్పుడో దేవుడిదయ రావాలి! అంతే!" అంటుంది.

ఎన్నాళ్ళైనా ఆమెకు ఈ ఆశ దూరంకాదు. ప్రతిరోజూ ప్రతి నిమిషమూ ఒక అంతులేని నిరీక్షణ! ఈ ఆశా, ఈ ఆవేదనా తనకు తెలియదు. తనకు నాన్న ముఖంకూడా గుర్తు లేదు. ఇంక ఎవరికోసం, దేనికోసం ఎదురుచూస్తుంది. అయినా ఏదో బాధ!

పక్కఇంటి రాగిణి తన తల్లికోసం ఇంకా ఎదురు చూస్తోంది. ఆవేళ తల్లితో చెరువుకు వెళ్ళింది. రాగిణిని చెరువు గట్టుమీద కూర్చోపెట్టి "ఇప్పుడే వస్తా" నని ఆవిడ బిందెతో చెరువులో దిగింది. అంతే! మళ్ళారాలేదు. ఇప్పటికీ రాగిణి ఆ చెరువుగట్టుమీదే ఎదురు చూస్తుంటుంది. ఇన్నాళ్ళకి ఆ చెరువుకూడా ఎండిపోయింది. ముళ్ళడొంకలు మొలిచాయి. అయినా రాగిణి ఎదురుచూడటం మానలేదు. "మా అమ్మ ఇప్పుడే వస్తానని చెప్పింది. తప్పకుండా వస్తుంది" అంటుంది అమాయకంగా! రాగిణి తండ్రి గోపయ్య కూతుర్ని చూచి కుమిలిపోతాడు. అతని గుండెల్లో రగుల్కొన్న దావాగ్ని ఎవరికి తెలుసు! ఆ నిరాశలో ఏ మూలో అతనికీ రేఖామాత్రంగా ఆశ ఉంటుందేమో! తన భార్య తిరిగి వస్తుందని!

ఈ జీవితం విచిత్రమైనది! విరిసిన పూవుకోసం ఆనందమూ, వాడిన తీగలకోసం పరితాపమూ! ఈ అనంత హృదయాల్లోని ఆ వేదనా, ఆనందమూ అంతా ఒక్కటే! ఒక్క హృదయంలోదే మరొక హృదయంలో ప్రతిధ్వనిస్తున్నది! నిజానికి ఇది ఒక్క హృదయం కాదు, అనంత హృదయాలు! ఇవి అనంతహృదయాలు కావు, ఒక్కటే హృదయం!

ఈ ఆలోచనలు ఎడతెగవు! ఏదో ఊహించుకుంటూ ఉంటే ఎంతసేపైనా అలాగే గడిచిపోతుంది. "మసకచీకటి కమ్ముకొంటోందిగదా! ఇంక వెళ్ళిపోవాలి" అనుకుంది సుమన. మేకల్ని అదలించి దగ్గరకు చేర్చుకొనేటప్పటికి ప్రళయం ముంచుకువచ్చినట్లు గాలి, వాన, తుఫానూ ముంచుకువచ్చాయి. ఉరుములు, మెరపులు భయంకరంగా ఉన్నాయి. ఈదురుగాలి కోటిసర్పాలు ఒక్కసారిగా మృత్యువులా బుసలు కొట్టినట్లుంది! అంతవరకు ఈ పెనుదుమారం ఎక్కడ దాగివుందో! దాని సూచనకూడా సుమనకు పొడకట్టలేదు. గబగబా మేకపిల్లల్ని రెండింటినీ దగ్గరకు చేర్చుకుని కాస్సేపు ఎక్కడ తల దాచుకోవాలా అని ఆలోచించింది.

*     *     *     *

కొండ కొంచెం పైకి ఎక్కితే అక్కడొక బంగళా ఉన్నది. అందులో ఒక కాపలావాడుకూడా ఉన్నాడు. కులాసాగా ఈకొండ చూడటానికి వచ్చినవాళ్ళు సరదాగా నాలుగు

రోజులు అక్కడ ఉండిపోతారు. మళ్ళా ఎవరైనా వచ్చేవరకు ఖాళీగా ఉంటుంది.

ఓసారి తను వెళ్ళి చూసింది, అక్కడ ఏముందో ఎవరున్నారోనని. ఆ కాపలావాడు తెలిసినవాడే. వాడితో మాట్లాడుతూ అన్నీ చూస్తూ చాలాసేపు అక్కడే ఉండిపోయింది. అప్పుడు బంగళానిండా ఎవరో ఆడవాళ్ళు, మగవాళ్ళు అంతా ఉన్నారు. వాళ్ళంతా ఎంతో ఆనందంగా ఉన్నట్లు కనిపించింది. అందరూ ఆడుతూ, పాడుతూ, ఎడతెగకుండా ఏదో తాగుతూ, తింటూ, వికారంగా నవ్వుతూ ఏదో గొప్ప ఆనందంలో మునిగి తేలుతున్నట్లున్నారు. బయట కిటికీలోనుంచి తను చాలాసేపు చూస్తూ ఉండిపోయింది. చూడగా చూడగా ఆ వెర్రిగోల తనకి వికారంగా అసహ్యమనిపించింది. వీళ్లు నిజంగా ఆనందంగా ఉన్నారా— లేక ఏదైనా భయంకరమైన విషాదాన్ని మరచిపోవటానికి వికటప్రయత్నం చేస్తున్నారా అనిపించింది. వెగటుతో అక్కడనించి వెళ్ళిపోయింది.

తన ప్రకృతే అలా అన్నింటికీ దూరంగా విరుద్ధంగా ఉంటుంది. అమ్మ అంటుంది, "ఏమి విచిత్రమో! పదహారేండ్లకే ఎందుకంత దిగులుగా విరక్తిగా ముసలి నాపసానిలా ఉంటావూ?" అని, కొంచెం విసుగుతో. తనకు తెలీదు. తనకు పదహారేళ్ళా— రెండు వేలేండ్లా? తనకి ఎన్నో జన్మలుగా, ఎన్నో వేలసంవత్సరాలుగా ఈ కొండశిఖరంమీదనించి ఈ ప్రపంచాన్ని చూస్తున్నట్లుంది! అవే దృశ్యాలు, అవే భావాలు, మళ్ళా మళ్ళా! తను అనంతంగా సాగిపోతున్న ఒక్క జీవకణం!

*　　　*　　　*

తుఫాను ఎక్కువైంది. బంగళా ఇంకా దూరంగానే ఉన్నది. అంచేత అక్కడే ఒక గుహలో దూరింది. ఆ గుహ ద్వారందగ్గర అన్నీ పెద్ద పెద్ద రాళ్లు అడ్డంగా ఉన్నాయి. వాటిని ఎక్కి దాటితేనేతప్ప లోపలికి వెళ్ళడానికి వీల్లేదు. అసలు ఆ రాళ్ళమూలాన, అక్కడ గుహ ఉన్నదని కూడా బయటికి తెలియదు. ఆ రాళ్లు బయటపెట్టని ద్వారంలా ఉన్నాయి. గాలిగాని, వర్షపునీరుగాని ఏ మాత్రమూ లోపలికి రాదు, మేకపిల్లలతో సహా అక్కడ హాయిగా స్తిమితపడింది సుమన. ఏదో అలసిపోయినట్లు నిద్రపోయింది. మేకపిల్లలూ నిద్రపోయినవి. మళ్లా ఎంతసేపటికో, ఎప్పుడో మెలకువ వచ్చింది. రాళ్ళమీద నించి ముందుకు వంగిచూచింది. ఇంకా వర్షం పడుతూనే ఉంది. ఎంతసేపైందో! కొద్దిగా కనిపించే వెలుగు తెల్లవారిందని సూచిస్తోంది. ఎల్లాగ బయటపడటమూ, ఇంటికి వెళ్ళటమూ అనుకున్నది సుమన.

*　　　*　　　*

ఉన్నట్లుండి, పిలుపు వినబడింది. "సుమనా, సుమనా" అంటున్నా రెవరో! కాస్సేపటికి తెలిసింది. అది మధుగొంతు. సంతోషంతో బయటికి వచ్చింది. అతను తెచ్చిన పెద్ద కంబళీ ఇద్దరూ కప్పుకున్నారు. మేకపిల్లల్ని ఇద్దరూ చెరొక్కటి ఎత్తు కున్నారు. నెమ్మదిగా కొండ దిగిపోయారు,

అప్పటికి గాలి తగ్గింది. సన్నగా చినుకుమాత్రం పడుతూనే ఉంది. తోవలో అతను చెప్పాడు: "రాత్రంతా ఎంత గాలి దుమారం! మన లోయలో ఒక్క ఇల్లయినా మిగలలేదు. అన్నీ సగం సగం కూలిపోయినవే. చాలా మందికి గాయాలు తగిలాయి. మనింట్లో కూడా నడవలో దూలం కూలిపోయింది. రాత్రంతా మీ అమ్మ కంగారు పడుతూనే ఉంది, నువ్వేమైనావో అని. అయినా చేసేదిలేక ఊరుకున్నాం. బయట ముఖం చూపించటానికి కూడా వీలులేదు. ఇప్పుడే కాస్త తగ్గింది" అంటూ ఇంకా ఏవేవో చెపుతున్నాడు.

తనకి తల దిమ్మెక్కింది. ఏం చెపుతున్నాడో సరిగా తెలియటంలేదు. తన నరాలన్నీ కరుడుకట్టి కొయ్యబారినట్లున్నాయి! ఏదో యాంత్రికంగా అతనితో సమంగా అడుగు ముందుకు వేసి సాగిపోతోంది.

అతను తనకు దూరపుచుట్టం. ఎప్పుడూ వస్తాడు తన కోసం. కొండమీద ఒంటరిగా ఉంటే అప్పుడప్పుడూ వచ్చి పలకరించేది అతనే. ఎప్పుడూ ఏవో కబుర్లు చెపుతూనే ఉంటాడు. ఎప్పుడూ అవి సగం సగమే తనకి అర్థమౌతాయి. ఓరోజు కబుర్లు చెపుతూ చెపుతూ తనని గట్టిగా కౌగలించుకున్నాడు. తనకేమీ కొత్తగా తోచలేదు. కోపంరాలేదు. సహజంగానే కనిపించింది. అంచేత మాట్లాడకుండా ఊరుకున్నది. దూరాన్నించి చూసిన అమ్మమాత్రం కోప్పడ్డది, "ఎదిగిన ఆడపిల్లలు అలా మగపిల్లలకి దగ్గరగా వెళ్ళకూడదు" అని. తన

కేమీా అర్థంకాలేదు. అమ్మకేదో ఎప్పుడూ ఇల్లాంటి గొడవే! ఎదిగిన ఆడపిల్లలు వల్లెలు వేసుకోవాలి. ఒంటరిగా కొండల మీాద షికార్లు తిరగకూడదు. మగపిల్లలకు దూరంగా ఉండాలి. ఇల్లాంటి వెన్నో అమ్మకు తెలుసు. తను ఇవేవీ లక్ష్యపెట్టదు. తను కాలక్షేపానికి ఈ మేకపిల్లల్ని పెంచుకుంటోంది. తెల్లగా ముద్దుగా ఉంటాయి. వాటికి ఇంకెక్కడా మేత దొరకదనికాదు. ఒంటరిగా హాయిగా వాటితో ఆడుకుంటూ ఉండడం తనకు సరదా! అంచేత అమ్మ ఎన్నిసార్లు వద్దన్నా వినిపించుకోకుండా ఒక్కత్తే వాటిని తీసుకుని కొండమీాదికి వెళ్ళిపోతుంది.

ఇల్లు చేరబోతూంటే మధు అన్నాడు మెల్లగా. "రాత్రి దూలం విరిగి పడిందికదూ? పాపం మీా అమ్మమ్మ—"

తనకు స్పృహ తప్పినట్లైంది, కళ్లు చీకట్లు కమ్మాయి. గుమ్మంలో అమ్మ తనని గట్టిగా పట్టుకుంది తూలిపోకుండా.

అమ్మమ్మ మంచంమీాద తెల్లని కొత్తదుప్పటి కప్పి ఉంది. బ్రతికినన్నాళ్లూ దానికోసం కలవరించింది. తనకి నర నరాలలో, అణువు అణువులో ఏదో బాధ. "పాపం, ఆకోడుకు తిరిగి రానేలేదు!" అనుకుంది తన అంతరంగం, ఎక్కడో లోలోపల.

– అమ్మ మళ్ళా మామూలు ధోరణి అందుకుంది. "మధూ, ఆ రెండు మేకపిల్లల్నీ నీవు పట్టుకపోయి ఎక్కడైనా వదిలేయి. వాటిని వెనక వేసుకుని ఈ పిల్ల ఇంటి పట్టున ఉండకుండా నా ప్రాణం విసిగిచేస్తోంది, ఎంత విన్పి

పించుకోదు! ఎప్పుడూ ఏదో ఒకటి నెత్తిమీదకు! దిక్కుమాలి నవి!" అంటూ తరిమేసింది.

తన హృదయం ముకుళించుకుపోయింది. కొందరు సునాయాసంగా కత్తులతో పొడవగలరు, రక్తపు బిందువు చిందకుండా !

తను అమ్మ చేతిలో గాలికి కదలిపొయ్యే పూవు! ఎప్పుడో అమ్మ ఆ పూవును మధు చేతుల్లోకి విసిరివేస్తుంది. బాధ్యత తీర్చుకుంటుంది. ఇప్పుడు ఎంత అదుపులో ఉంచినా ఆఖరుకు అమ్మ ఉద్దేశ్యం అదే! ఈ చెర్లాటంతో తనకు సంబంధం లేదు.

ప్రస్తుతం తనకి విపరీతమైన అలసట, ఏదో నిస్పృహ తప్ప ఏమీ తెలియటం లేదు. నిద్ర కమ్ముకువస్తోంది. అనంతంగా నిద్రపోగలిగితే!"